# అతివృష్టి-అనావృష్టి

నరసయ్య సిమెంట్ తీసుకొస్తానని పది రూపాయలు పట్టుకెళ్ళి రెండురోజులైనా రాలేదు. నరసయ్య చాలా నమ్మకస్తుడే. తాగుడు అలవాటుండటం వల్ల ఆ బలహీనతకి లొంగిపోయి ఆ పది రూపాయలూ ఖర్చు పెట్టేశాడేమో, కొన్నాళ్ళు పోతే నేను మరచి పోతాను కదా అనుకున్నాడేమో అంటే, అలాంటి వాడు కాదు. పని పట్ల చాలా శ్రద్ధ ఉన్నవాడు. అసలు అతను తాపీపని చేసేవాడు కాదు. డ్రైయినేజీలు బాగు చేస్తాడు. మునిసిపాలిటీలో పనిచేసే వాడు కాదు.

అనంతపురం వైపు నుంచి వలస వచ్చిన కూలి. మోరీలూ, డ్రెయినేజి పైపులూ శుభ్రం చెయ్యడమే కాకుండా, కొద్దిగా తాపీ పనులూ, కొద్దిగా వడ్రంగిపనులూ, గోడలకి సున్నం వెయ్యడం, తోట పనులూ అన్నీ కాస్తోకూస్తో తెలిసిన వాడు. అయిదారేళ్ళ నుంచీ అవసరమైనప్పుడల్లా వచ్చి అలాంటి పనులు చేస్తున్నాడు. పనికి తగ్గట్లు డబ్బులిచ్చి పంపిస్తూంటాను. నేను వెళ్ళి పిలవడం కష్టం అవుతోందని, అతన్నే వారానికొకసారి వచ్చి కనుక్కుని వెళ్ళమని చెప్పాను. వారం మధ్యలో కూడా వచ్చి కనిపిస్తూంటే, ఏదో పని కల్పించి అయినా, చెప్పి చేయించి, పదో ఇరవయ్యో ఇచ్చి పంపిస్తూంటాను.

పెరట్లో నాపరాళ్ళ మధ్య సిమెంట్ అతుకులు బాగా పగిలిన చోట్ల మళ్ళీ సిమెంటు పూయమని చెప్పి, సిమెంటు తీసుకురావడానికి పదిరూపాయలిచ్చాను. రెండు రోజుల క్రితం. ఇంతవరకు మళ్ళీ ముఖం చూపించలేదు. ఒంట్లో బావుండలేదేమోనని సర్ది చెప్పుకున్నాను. కానీ నేను బజారులో వెడుతూంటే దూరం నుంచి కనిపించాడు. కొంచెం కోపం వచ్చింది నాకు. నరసయ్య ఈసారి ఇంటికి రాగానే కాస్త మందలించాలనుకున్నాను. ఆ సాయంకాలం కూడా రాలేదు. మర్నాడు పొద్దున్న పది దాటాక వచ్చాడు.

"ఏమిటి నరసయ్యా, ఇప్పుడా రావడం!!' అన్నాను. కాస్త గట్టిగానే.

మాట్లాడకుండా తలవంచుకుని నిల్చున్నాడు.

"ఏమైంది?" అన్నాను, రాకపోవడానికి ఏం వంక చెబుతాడో విందామని.

"మా పిల్ల కనిపించట్లేదమ్మా రెండు దినాల నించి" అన్నాడు దీనంగా.

"అయ్యో, మరేం చేశావ్"? అన్నాను.

"ఏం జెయ్యనమ్మా, ఎతుకుతున్నాం.ఒక ఇరవై రూపాయలుంటే ఇయ్యండమ్మా" అన్నాడు.

దుఃఖాన్ని మరచిపోవడానికి తాగేందుకా ఆ డబ్బు? అని మనసులో అనుకుని, పైకి, "దేనికి?" అని అడిగాను.

"దూరాలకు పోయి ఎతకాలంటే బస్సుకి పైసలు కావాలి గదమ్మా. ఈ రెండు దినాలూ సరిగా కూలిపని కూడా సెయ్యకుండ దాని కోసమే ఎతుకుతున్నానమ్మా" అన్నాడు.

"పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి రిపోర్ట్ ఇవ్వలేదా?" అని అడిగాను.

"ఎళ్ళినానమ్మా, ఆళ్ళు ఇనిపించుకోటం లేదు. పైగా నవ్వుతాలుగా తీసుకుంటున్నారు. ఎవడితో లేచిపోయిందో ఏమో కనుక్కోపో" అంటూనన్ను పొమ్మన్నారమ్మా అన్నాడు బాధగా.

నరసయ్య కూతురికి పదమూడో పధ్నాలుగో ఉంటాయి. బక్కగా ఉంటుంది. రెండు జడలు వేసుకుని పైకి మడిచి రిబ్బన్లు కట్టుకుంటుంది. పరికిణీ, జాకట్టూ వేసుకుంటుంది. కిందటేడే పెద్దమనిషైంది. "మా పిల్ల పెద్దమనిసైందమ్మా" అంటూ వచ్చింది నరసయ్య పెళ్ళాం ఓ రోజున. నరసయ్య లాగ పనిమంతురాలు కాదు ముత్యాలు.శ్రద్ధగా చెయ్యదు ఏ పనీ. అందుకే దాన్ని పిలిచి ఏ పనీ చెప్పను నేను. కూతురు బంగారి సన్నజాజులు కోసుకోవడానికి తల్లితో పాటు వచ్చేది అప్పుడప్పుడు. అది కూడా తల్లిపోలికే. చురుకుతనం లేదు. చదువూ సంధ్యాలేవు. ఆ పిల్లంటే కూడా నాకు సదభిప్రాయం లేదు. ఒక్క నరసయ్యకే పనులు చెబుతూ డబ్బులిస్తూంటాను. అయినా, కూతురు పెద్దమనిషైందని ముత్యాలు వచ్చి చెప్పగానే, రెండు అండర్‌వేర్లూ, అయిదు రూపాయలూ,ఇంట్లో ఓ బిస్కట్ పేకెట్ ఉంటే అదీ ఇచ్చి పంపించాను. ఆ పిల్ల కనిపించడం లేదని ఇప్పుడు తెలిసి బాధపడ్డాను.

పాపం, వాళ్ళకి ఇల్లూ వాకిలీ లేవు. పేవ్‌మెంట్ మీదే జీవనం. నిత్యావసరాలకి వాళ్ళు ఎలా తంటాలు పడుతున్నారో తలుచుకుంటే నాకు ఒళ్ళు జలదరిస్తుంది. తలదాచుకోవడానికీ, ఒళ్ళు దాచుకోవడానికీ నిలువ నీడ లేని వాళ్ళు. అలాంటి చాలా మంది లాగే, అనంతపురం వైపు నుంచి వలస వచ్చినవాళ్ళు. రోజుకూలీ మీద బతుకుతున్న వాళ్ళు. ఓ గుడిసె వేసుకోవడానికి కూడా ఆస్కారం లేని వాళ్లు. ఏ రోజైనా

కూలి దొరక్కపోతే ఎలా తంటాలు పడతారో. అలా కూలి దొరకనప్పుడు నా దగ్గరికి అప్పుడప్పుడు వస్తూనే ఉంటాడు-"అమ్మా, ఓ యాభై రూపాయలుంటే ఇయ్యి, మళ్ళీ రేపిచ్చేస్తాను" అంటూ. అంత డబ్బు నేను మాత్రం ఎలా ఇవ్వగలను చీటికీ మాటికీ.

"నా దగ్గర లేదయ్యా ఇప్పుడు" అని చెప్పినా, "ఈసారి పని చేయించుకున్నప్పుడు పట్టుకుందువులే, ఈ ఒక్కసారి ఎట్లాగయినా ఇయ్యమ్మా" అంటూ బతిమాలతాడు. రెండు మూడుసార్లు అడిగాక, ఇరవయ్యో ముప్ఫయ్యో ఇచ్చి పంపిస్తూంటాను. మళ్ళీ పనికి వచ్చినప్పుడు ఉత్తిచేతుల్తో వెళ్ళడు, నేను పంపలేను.

ఇప్పుడు కూతుర్ని వెతకడానికి ఇరవైరూపాయలు కావాలన్నాడు. డబ్బులిస్తూ "మళ్ళీ పోలీసు రిపోర్టు ఇవ్వడానికి ప్రయత్నించు" అన్నాను.

"లాభం లేదమ్మా, పిల్లదాని ఫోటో కావాలంటన్నారు. యాడనుంచి తెచ్చేది? మాకు ఫోటోలు కూడా ఉంటయ్యా?" అన్నాడు.

"పత్రికల వాళ్లని అడక్కపోయావా?" అని అడగాలనుకున్న ప్రశ్నని లోపలే అణిచేసుకున్నాను. ఏదైనా దుర్ఘటన జరిగినప్పుడు యాజమాన్యం పంపిస్తే ఎవరైనా విలేఖరీ, ఫోటో గ్రాఫరూ వస్తారు. ఇలాంటి స్వల్ప విషయాల్ని ఎవరు పట్టించుకుంటారు? పైసలిస్తే గాని పత్రికల వాళ్ళు ప్రకటనలు వేసుకుంటారా?

మర్నాడు, మా ఇంట్లో పనిచేసే లక్ష్మితో అన్నాను.

"నరసయ్య కూతురు కనిపించడం లేదుట పాపం" అని.

"దాన్నెవల్లో తీస్కపోయారేమోనమ్మా. ఇంతకు ముందోసారి దాన్నెవల్లో పాడుచేసినారని చెప్పుకున్నారు. ఆ పార్కు దగ్గరుంటున్నోల్లు" అంది.

నిజమే, ఆ పిల్లకి పేవ్‌మెంట్ మీద రక్షణ ఎక్కడుంటుంది? ఆడదైతే చాలు, అందం చందం లేకపోయినా, ఆరోగ్యం లేకపోయినా, అందుబాటులో ఉంటే చాలు అనుభవిస్తారు. తల్లి మాత్రం ఎంతకని కనిపెట్టుకుని ఉండగలదు? పేదరికంలో పిల్లల్ని ప్రలోభపెట్టేవి ఎన్నో ఉంటాయి. ఆ పిల్లకి ఏవో మాయమాటలు చెప్పి ఎవరైనా తీసుకు పోయారేమో ఎక్కడైనా అమ్మెయ్యడానికి. లేకపోతే, నలుగురూ అనుభవించి ఏ కాలవలో పారేశారో- నా మనస్సు పరిపరివిధాలపోయింది.

మనస్సుకి కాస్త తేలిగ్గా ఉంటుందని, టి.వి. పెట్టాను. ఫలానా వారి కూతురు 'లేచి పోయింది'అన్న వార్త ఘనంగా, చిలవలు పలవలుగా చెబుతూ ఫోటోలు చూపిస్తున్నారు. సంపన్న కుటుంబంలో ఎంత అల్లారుముద్దుగా పెరిగినా, మైనారిటీ తీరినా, ప్రేమించిన వాణ్ణి పెళ్ళి చేసుకోవడానికి స్వేచ్ఛ లేక, ఇంట్లో రక్షణ లేక, ప్రేమించిన యువకుడితో

కూతురు 'లేచి పోయింది'. అలనాడు రుక్మిణీ దేవి కూడా తను ప్రేమించిన వాణ్ణి పెళ్ళి చేసుకోవడానికి సాహసించవలసి వచ్చింది. అన్నగారి నియంతృత్వం భరించలేక, తను ప్రేమించిన శ్రీకృష్ణుణ్ణి రహస్యంగా రప్పించుకుని, వీరోచితంగా రథం మీద అతనితో వెళ్ళి పోయింది. అయితే, లేవదీసుకు పోయిన అందరు కుర్రాళ్ళూ శ్రీకృష్ణుడంతటి వాళ్ళు కారు కదా.

ఈడొచ్చిన పిల్లకి బలవంతంగా తమకి నచ్చిన వాడికిచ్చి పెళ్ళి చెయ్యాలనుకోవడం పెద్దల తప్పు. అయితే, తను ప్రేమించిన వాడు మంచి వాడు అవునా కాదా, ఆర్థికంగా తన కాళ్ళమీద నిలబడి, తన భార్యని పోషించగలడా లేడా అని చూసుకోకుండా "గుడ్డిగా" ప్రేమించి, తల్లిదండ్రులకి తెలియకుండా లేచిపోవడం పెద్ద తప్పు. స్వేచ్ఛ కావాలనుకున్నప్పుడు బాధ్యత కూడా ఉండాలి. తల్లిదండ్రులు ఎలాగూ దిగివస్తారు కదా అన్న ధీమాతో బరితెగించడం బాధ్యతారాహిత్యం అవుతుంది.

ఒకవైపు ఆ సంపన్నులైన తల్లిదండ్రులు, తమ పరువు ప్రతిష్టలు దెబ్బతింటాయనీ, తమ కుటుంబ విషయాలు రచ్చకెక్కుతున్నాయనీ, అనవసరపు ప్రచారానికి గురి అవుతున్నామనీ బాధపడుతుంటే, మరోవైపు ఓ ఇల్లూ వాకిలీ లేని పేవ్‌మెంట్ నివాసి, తన కూతురు ఫోటో అయినా లేక, ఫలానా అమ్మాయి కనిపించడం లేదు, మీరు చూశారా, చూస్తే మాకు ఈ చిరునామాకి తెలియజేయండి అని చెప్పుకునే దిక్కులేక, కూతుర్ని వెతకడానికీ, వెతికించడానికీ డబ్బు లేక బాధపడుతున్నాడు. ఆ పిల్ల పోతే పోయిందిలే, ఒక కడుపునింపే ఖర్చు తగ్గుతుందని అనుకోలేరు కదా. ఎంతయినా కడుపుతీపి.

ఎంత తీసిపారేద్దామనుకున్నా నరసయ్య కూతురి విషయం నా మనసుని కెలుకుతూనే ఉంది. మరోవైపు టి.వి. తెరిస్తే ఆ ప్రఖ్యాత పురుషుడి ముద్దుల కూతురు లేచిపోయిన విషయమే రకరకాల కోణాల నుంచి పూర్వాపరాలు ప్రదర్శిస్తున్నారు కొన్ని ఛానల్స్ వాళ్ళు. ఏ వారపత్రిక తెరిచినా 'సెంటర్ స్ప్రెడ్'లో వాళ్ళ విశేషాలే. ఆ లేచిపోయిన యువతీ యువకులు పెళ్ళి చేసుకున్నారనీ, ఫలానా చోట క్షేమంగా, సుఖంగానే ఉన్నారనీ, ఇంటికి తిరిగి రావడానికి భయపడుతున్నారనీ తెలియజేస్తున్నారు. కథ సుఖాంతం ఎప్పుడవుతుందా అని ప్రేక్షకులూ, పాఠకులూ ఎదురుచూస్తున్నారు.

నరసయ్య మళ్ళీ నాలుగు రోజులు పోయాక వచ్చాడు. ముఖంలో సంతోషం లేదు గాని, ఇదివరకటి నిర్లిప్తత లేదు. "ఏమైంది? నీ కూతురి సంగతి తెలిసిందా?" అని కుశలప్రశ్న వేశాను.

"యాడ దొరుకుద్దమ్మా? ఎవులు తీసుకుపోయినారో ఏమో, అది అసలే పిరిగ్గ[illegible]ది, ఎర్రిబాగుల్ది" అన్నాడు ఉదాసీనంగా.

"ఎలామరి?" అన్నాను.

"ఏం జేస్తాం. దాని మొగాన, మా మొగాన అంతేరాసి పెట్టుందనుకుంతన్నాం. అది తిరిగొత్తే మాత్తరం, మేం దాని మంచీ సెడూ సూడగలమా, దానికి లగ్గం సెయ్యగలమా? ఎవులు స్సేసుకుంటాడు దాన్ని ఇంత జరిగినాక? ఎక్కడో ఓ సోట బతికుంటే అంతే సాలు అనుకుంతన్నాం. ఆ బగమంతుడే దాన్ని రచ్చించాల" అన్నాడు.

కర్మ సిద్ధాంతం ఎంత ఉపశమనాన్ని కలిగిస్తుంది! అందులోనే ఎవరికైనా జీవన మార్గం ఎంత సుగమం అయినట్లు అనిపిస్తుంది!

*(చేతన, జనవరి 2008)*